ఆ బాల.. గోపాలం


కృషుడి వేషధారణలో ఇషాన్

పాఠశాలల్లో చిన్నారులు సందడి చేశారు. చిన్నికృష్ణుడు, గోపిక, సత్యభామల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పిల్లనగ్రోవి చేతబూనిఆలపించారు.అందరినీ అలరించారు. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



రామంతాపూర్ వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం




సఫిల్‌గూడలో...


ఉప్పల్ అపురూప జగపతి హైట్స్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో కన్నయ్యలు






రామంతాపూర్‌లో.. జశ్విత


హబ్సిగూడ బిర్లా ఓపెన్ మైండ్స్ ప్లే స్కూల్ విద్యార్థి పడాల మిథాన్ష్


ఉప్పల్ మినీ శిల్పారామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో కూచిపూడి కృష్ణలీల నృత్యరూపకం


శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మేయర్









చిన్నికృష్ణుల వేషధారణల్లో చిన్నారులు


శ్రీ కృష్ణయాదవ సంఘం నేత సునీల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం






గోపికలు, చిన్నికృష్ణుడి వేషధారణల్లో ఉప్పల్ విజయపురి కాలనీలోని స్కూల్ చిన్నారులు


ర్యాలీలో పాల్గొన్న మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్

ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి


కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గౌతంనగర్: హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు సోమవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలో మల్కాజిగిరి ముదిరాజ్ సంఘంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


సోనియాగాంధీనగర్ (ఓల్డ్) కాలనీ సంఘం కార్యవరం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ సోనియాగాంధీనగర్(ఓల్డ్) కాలనీ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షురాలుగా కె.ప్రభావతి, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షులుగా బి.వెంకట్రావు, జి.రాంచందర్, కోశాధికారిగా సి.ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా యాకోబ్, కృష్ణ, సతీష్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ప్రతాప్ రెడ్డి, టి. వెంకటేష్, సలహాదారులుగా అప్పారావు, వెంకటరమణ, మన్యంరాజు, భవనరాజు, కార్యవర్గ సభ్యులుగా అంజిలప్ప, నాగరాజు, శోభన్‌బాబు, ప్రసాద్, లోకేష్, కాంతారావు, సుబ్బారావు, కళ్యాణిరెడ్డి, లక్ష్మీ, సత్య ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నాగిళ్ల బాల్‌రెడ్డి, సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, బాలనర్సింహ్మా, మల్లేష్, సంపత్, దయాకర్‌రెడ్డి, శ్రీను, బిక్షపతి పాల్గొన్నారు.

ఆచారాలను కాపాడుకోవాలి


తీజ్ పండుగ వేడుకల్లో చంద్రునాయక్, వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: అనాదిగా వస్తున్న ఆచారాలను, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారంరాత్రి బాలాజీ హిల్స్ కాలనీలో నిర్వహించిన తీజ్ పండుగ ముగింపు ఉత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గిరిజన యువతులు, మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందంగా జరుపుకునే పండుగ తీజ్ అని అన్నారు. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్య దైవం మేరామాయాడి, సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఓల్డ్ అల్వాల్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ జిల్లా పరిషత్ హై స్కూల్ 1994–95 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. 30 సంవత్సరాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఆనందమూర్తి, సునీత, శివరామకృష్ణ, శ్రీరాములు, ప్రసాద్, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పూర్వ విద్యార్థులు శ్రీశైలంయాదవ్, హరి, జైపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను పూర్తిగా తొలగిస్తాం


గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఆయన చెరువును పరిశీలించారు. చెరువులోకి మురుగునీరు వస్తున్నదని జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఈ మహేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ మురుగునీరు చేరుతుండటం వల్లే గుర్రపుడెక్క విస్తరిస్తోందని, దీంతో దోమల బెడద, దుర్వాసన వేధిస్తున్నాయని అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే



కాప్రా: నియోజకవర్గంలోని ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. గ్రీన్ సైనిక్‌పురిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు పలు సమస్యలు విన్నవించారు. ఈసీఐఎల్ చౌరస్తా వరకు మెట్రో రైలు సౌకర్యం కల్పిస్తే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. ఈసీఐఎల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్, బీఆర్ఎస్ నాయకులు భైరి నవీన్‌గౌడ్, గ్రీన్ సైనిక్‌పురి ప్రతినిధులు చంద్రశేఖర్, బీజేపీ నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో కాలనీని చూపడం తగదు

మహేశ్వరినగర్ అసోసియేషన్ ప్రతినిధులు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మహేశ్వరినగర్ ఉన్నట్లు చూపించడం దారుణమని మహేశ్వరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. సోమవారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న సాయిచిత్రనగర్‌ని వదిలేసి మహేశ్వరినగర్ కాలనీ ఉన్నట్లు శాటిలైట్ చిత్రాలు చూపడం విచారకరమని పేర్కొన్నారు. మహేశ్వరినగర్ కాలనీ 1977లోనే ఏర్పడిందని, ఆ తర్వాత చిన్న, చిన్న కాలనీలన్నీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహేశ్వరినగర్ కాలనీకి సంబంధం లేదన్నారు. దీనిపై నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంగా పనిచేసి ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించాలని కోరారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించి మహేశ్వరినగర్ కాలనీకి న్యాయం చేయాలని, లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, బాబురావు, రామ్ మల్లారెడ్డి, ఖాజా కుతుబుద్దీన్, రామ్‌గోపాల్ రెడ్డి, కొండల్‌రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేశ్వరినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

నియామకం

ఘట్‌కేసర్: ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎదులాబాద్ గ్రామానికి చెందిన ఎదుగని శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు నియమాకపత్రాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరప్ప, దివాకర్ నగరంలోని కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... ఓబీసీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానందరాజ్, కార్యదర్శి గుండ్ల ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని వినతి

ఘట్‌కేసర్: రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పట్టణంలో రైల్వే వంతెన పనులు జరుగుతుండటంతో రోడ్డును మూసివేశారన్నారు. దీంతో తాత్కాలికంగా నారాయణ గార్డెన్ నుంచి లక్కీ వైన్స్ వరకు ప్రస్తుతం రాకపోకలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆ రోడ్డులో గుంతలో ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మశ్చేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, నరిసింగ్‌రావు, సిరాజ్, మున్సిపల్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.



నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు కమిషనర్ రామలింగం వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు 1, 4, 6, 13, 17, 18, 23 డివిజన్ల పరిధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు.

డ్యూటీకని వెళ్లిన యువకుడి అదృశ్యం


నవీన్ (ఫైల్)

మల్కాజిగిరి: డ్యూటీకని ఇంటి నుంచి బయలుదేరిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ... ఇందిరా నెహ్రూనగర్‌కు చెందిన జంగటి నవీన్(29) ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి. ఈ నెల 21వ తేదీన డ్యూటీకని ఇంటి నుంచి హోండా యాక్టివాపై బయలుదేరాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతోపాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. నవీన్ తండ్రి జావెద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


దిలీప్

మల్కాజిగిరి:ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మారుతీనగర్‌కు చెందిన రాజేందర్, లలిత దంపతులు. రాజేందర్ లారీ డ్రైవర్. అతని కుమారుడు తరుణ్ అలియాస్ దిలీప్(20) ఇంటి వద్దనే ఉంటూ ఓపెన్ డిగ్రీ చదువుతున్నాడు. మూడురోజుల క్రితం లలిత, మరో కుమారుడు నవీన్‌తో కలిసి సొంతవూరుకు వెళ్లారు. ఈ నెల 25వ తేదీ రాత్రి దిలీప్‌కు తండ్రి ఫోన్ చేస్తే స్పందించలేదు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి చూసేసరికి లోపల గడియపెట్టి ఉంది. తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా దిలీప్ ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

గుండ్ల చెరువును కాపాడాలని ధర్నా

కీసర: జవహర్‌నగర్ చెత్తడంపింగ్ యార్డు నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ సమీపంలోని గుండ్ల చెరువును పూర్తిగా కబ్జా చేసిందని జేఏసీ ఆరోపించింది. హైడ్రా అధికారులు స్పందించి ఈ చెరువును కాపాడాలని డిమాండ్ చేసింది. జవహర్‌నగర్ చెత్త డంపింగ్‌పై పోరాటం చేస్తున్న జేఏసీ ఆధ్వర్యంలో హరిదాస్‌పల్లి సమీపంలో జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. జేఏసీ ధర్నాకు బీజేపీ నేత ఏనుగు సుదర్శన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల సమీపంలోని దమ్మాయిగూడ, నాగారం, జవహర్‌నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ డంపింగ్ యార్డు సమీపంలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుండ్ల చెరువును పూర్తిగా కబ్జా చేస్తూ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలను చెరువులోకి వదిలిపెట్టడంతో చెరువు పూర్తిగా కలుషితంగా మారిపోయిందన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా గెలుపొందిన ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.


ధర్నాకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేత సుదర్శన్‌రెడ్డి తదితరులు

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

కుషాయిగూడ ఏసీపీ మహేష్

కీసర: గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్ అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సుర్వీబాబయ్య ఫంక్షన్ హాల్‌లో కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... నాగారం మున్సిపాలిటీతోపాటు కీసర మండలంలోని వివిధ ప్రాంతాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు మొదలుకొని విగ్రహాల నిమజ్జనం వరకు ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా మెలగాలన్నారు. విద్యుత్‌శాఖ నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ యాప్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, విద్యుత్ ఏఈ మురళీకృష్ణ, దమ్మాయిగూడ, నాగారం, కీసర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుషాయిగూడ ఏసీపీ మహేష్